## క్లుప్తంగా


### అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



నృత్యాలు చేస్తున్న చిన్నారులు

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని డాక్టర్ వైఎస్సార్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను అలరించాయి. డ్యాన్స్ మాస్టర్ విజయశాంతి (సీఎం అవార్డు గ్రహీత), ముద్రడ్యాన్స్ స్కూల్ కడప చిన్నారులు నృత్యం చేశారు. మూషికవాహన.. మోద కహస్తా, బృందావనమాలి.. రారా మా ఇంటికి ఒకసారి, తదితర పాటలకు చిన్నారులు చేసిన నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఏఓ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

### తెగిపడుతున్న విద్యుత్ తీగలు



లింగాల ఎంపీడీఓ కార్యాలయం వద్ద కాలిపోయిన జంపర్లు

లింగాల : మండలంలో ఎండ వేడికి విద్యుత్ తీగలు తెగిపడు తున్నాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. ఆదివారం ఎంపీడీవో కార్యాలయం వద్ద 33 కేవీ విద్యుత్ లైన్ జంపర్లు ఎండ వేడికి కరిగి కాలిపోయాయి. దీంతో ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఆగిపోయింది. గత రెండు రోజులుగా సబ్ స్టేషన్లలో మరమ్మతుల కారణంగా విద్యుత్ కోత విధించారు. మండుతున్న ఎండలు, ఉక్క పోతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు తన చర్యలు తీసుకుని విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

### వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలి

కడప కార్పొరేషన్ : సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని బేడ, బుడగ జంగం హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పస్తం అంజి పిలుపునిచ్చారు. ఆదివారం తమ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు బుడగ జంగం కమ్యూనిటీని పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వం బేడ, బుడగ జంగం ప్రజలను గుర్తించి జగనన్న చేయూత, అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, ఇంటి స్థలాలు, పక్కా గృహాలు వంటి అనేక రకాల సంక్షేమ పథకాలు ఇచ్చారన్నారు. ఈ పథకాల వల్ల బుడగ జంగం ప్రజలు ఎంతో లబ్ధి పొందారన్నారు. బేడ, బుడగ జంగాల వారికి ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యను సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకుపోయామని, ఆయన సానుకూలంగా స్పందించి ఆంధ్రప్రదేశ్ క్యాబినెట్లో ఆమోదించి బిల్లును కేంద్రానికి పంపించారన్నారు. ఇన్ని విధాలుగా మేలు చేసిన వైఎస్ జగన్‌కు బుడగ జంగాలు అండగా నిలవాలని కోరారు. ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేయాలని కోరారు. వైఎస్ అవినాష్‌రెడ్డిని ఎంపీగా, అంజద్‌బాషాను ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బేడ, బుడగ జంగం నాయకులు కే. లక్ష్మయ్య, డి రాముడు సి వెంకటయ్య, పి ఆంజనేయులు, కే మంతయ్య, పి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### తల్లికి పాదపూజ



కాళ్లు కడిగి పూజ చేస్తున్న చిన్నారులు

కమలాపురం : కమలాపురం పట్టణంలోని కోదండ రామాలయంలో గ్రేటర్ వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో తల్లికి పాదపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక పురాతన కోదండ రామాలయంలో గ్రేటర్ వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో తల్లికి వందనం పేరిట తల్లులకు పాద పూజ నిర్వహించారు. తల్లికి తమ పిల్లలు సాంప్రదాయ బద్ధంగా కాళ్లు కడిగి ఆశీర్వాదం పొందారు.

# పోలింగ్‌కు సర్వం సిద్ధం

- ఎన్నికల బరిలో 27 మంది అభ్యర్థులు
- నియోజకవర్గ వ్యాప్తంగా 301 పోలింగ్ కేంద్రాలు
- 2,29,687 మంది ఓటర్లు
- 1806 మంది పోలింగ్ సిబ్బంది విధులు
- ఎన్నికల పర్యవేక్షణకు 500 మంది పోలీసులు

పులివెందుల : సోమవారం (నేడు) జరిగే ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. ఎన్నికల అధికారులు పోలింగ్‌కు అవసరమైన ఈవీఎంలు, వీవీ ప్యాట్ (ఓటర్ వెరిఫైబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్)లతో పాటు అన్నిరకాల సామగ్రిని సిద్ధం చేశారు. ఎన్నికల సిబ్బంది సామగ్రిని వారికి విధులు కేటాయించిన పోలింగ్ బూత్‌ల వద్దకు చేర్చారు. పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గంలో 27 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 301 పోలింగ్ కేంద్రాల్లో 2,29,687 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 1806 మంది పోలింగ్ సిబ్బంది విధులు నిర్వహిస్తారు. వీరికి మరో 50 మంది సిబ్బంది రిజర్వులో ఉన్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో పీఓ ఒకరు, ఏపీఓ ఒకరు, ఓపీఓ నలుగురు చొప్పున ఆరుగురు విధులు నిర్వహించనున్నారు. పోలీసులు ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా 119 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. ఈ పోలింగ్ కేంద్రాల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పెద్ద ఎత్తున పోలీసు బలగాలను ఏర్పాటు చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఒక ఎస్పీ, ఒక అడిషనల్ ఎస్పీ, ఒక డీఎస్పీ, 10 మంది సీఐలు, 11మంది ఎస్సైలు, 170మంది పారా మిలటరీ బలగాలతో కలిపి మొత్తం 500మందికి పైగా పోలీసు సిబ్బంది ఎన్నికల విధులు నిర్వహిస్తారు. ఆదివారం సాయంత్రానికి పోలింగ్ కేంద్రాలకు ఈవీఎం, వీవీ ప్యాట్‌లను తరలించారు. ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటేశులు తెలిపారు.



పోలింగ్ కేంద్రాలకు తరలించనున్న ఈవీఎంలు

**ఓటు హక్కు వినియోగించుకోనున్న సీఎం వైఎస్ జగన్ దంపతులు**

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్ భారతిరెడ్డి దంపతులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఆదివారం సాయంత్రం వారు పులివెందులకు చేరుకున్నారు. భాకరాపురంలో గల 138 పోలింగ్ కేంద్రంలో తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇదే పోలింగ్ కేంద్రంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఇతర వైఎస్ కుటుంబ సభ్యులు ఓటు వేయనున్నారు.

**పోలింగ్ సిబ్బందిని తరలించేందుకు ప్రత్యేక బస్సులు**

పులివెందుల రూరల్ : సోమవారం (నేడు) జరిగే ఎన్నికల కోసం పులివెందుల డిపో నుంచి 48 బస్సు సర్వీసులు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. పోలీసు సిబ్బంది వారికి కేటాయించిన నియోజకవర్గాలు, గ్రామాలు, మండలాలకు వెళ్లేందుకు ఆదివారం ఉదయం నుంచి సోమవారం సాయంత్రం 6.30గంటల వరకు బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. తిరుగు ప్రయాణానికి 13వ తేదీ రాత్రి 8గంటల వరకు బస్సు సౌకర్యం కల్పించామన్నారు. అలాగే బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, విజయవాడ ప్రాంతాల నుంచి ఓటు వేసేందుకు పులివెందుల ప్రాంతానికి వచ్చే ప్రయాణికుల కోసం కూడా 10 ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు వివరించారు.

**లింగాల మండలంలో..**

లింగాల : లింగాల మండలంలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేశారు. మండల వ్యాప్తంగా 31 పోలింగ్ కేంద్రాల్లో 23,715 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో 11,990మంది స్త్రీలు, 11,725మంది పురుషులు ఉన్నారు. పోలింగ్ కేంద్రం వద్ద షామియానాలు ఏర్పాటు చేశారు. విద్యుత్ సరఫరాకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. తాగునీటి వసతి కూడా కల్పించారు.

**వేంపల్లె మండలంలో..**

వేంపల్లె : 2024 సార్వత్రిక ఎన్నికలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మండల వ్యాప్తంగా 65 పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, మౌలిక వసతులు కల్పించారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. అధికారులు ఆయా పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. సిబ్బందికి తగిన సలహాలు, సూచనలు చేశారు. ఏదైనా సమస్య వస్తే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఇప్పటికే ఈవీఎం మిషన్లు ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరాయి. సమస్యాత్మక ప్రాంతాలైన అలవలపాడు, రామిరెడ్డిపల్లె, కుప్పాలపల్లి గ్రామాల్లో పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో అధికారులు పర్యటించి స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు.

**సింహాద్రిపురం మండలంలో..**

సింహాద్రిపురం : సోమవారం జరిగే సార్వత్రిక ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. మండల వ్యాప్తంగా 20 పంచాయతీలకు 37 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మండల వ్యాప్తంగా మొత్తం 25,942 మంది ఓటర్లున్నారు. మహిళలు 13,402 మంది, పురుషులు 12,539మంది ఉండగా ఒక ట్రాన్స్‌జెండర్ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

**వేముల మండలంలో..**

వేముల : సోమవారం జరుగనున్న ఎన్నికలకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మండల వ్యాప్తంగా 28 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రానికి 100మీటర్ల పరిధిలో ఎవరూ ఉండకుండా 144 సెక్షన్ అమలు చేశారు. మండల వ్యాప్తంగా 22,343మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

**తొండూరు మండలంలో..**

తొండూరు : నేడు (సోమవారం) జరిగే ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్‌ఓ వెంకటేశులు తెలిపారు. మండలంలో 19296 మంది ఓటర్లు ఉన్నారు. 29పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

**మండలాల వారీగా ఓటర్ల వివరాలు**

| మండలం | పురుషులు | స్త్రీలు | ఇతరులు | మొత్తం |
|---|---|---|---|---|
| సింహాద్రిపురం | 12,539 | 13,402 | 1 | 25,942 |
| లింగాల | 11,725 | 11,990 | - | 23,715 |
| పులివెందుల | 31,091 | 24,028 | 14 | 65,133 |
| వేముల | 10,985 | 11,358 | - | 22,343 |
| తొండూరు | 9,482 | 9,814 | - | 19,296 |
| వేంపల్లె | 22,361 | 23,558 | 3 | 45,922 |
| చక్రాయపేట | 13,544 | 13,791 | 1 | 27,336 |
| మొత్తం | 1,11,727 | 1,17,941 | 19 | 2,29,687 |



లింగాల పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన షామియానా



వేంపల్లెలో బారికేడ్ల ఏర్పాటు



సింహాద్రిపురం: పోలింగ్ కేంద్రం వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు



పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసినబారికేడ్లు



ఎన్నికల విధులకు హాజరైన పోలింగ్ సిబ్బంది



పారా మిలటరీ బలగాలతో గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు



సీఎం వైఎస్ జగన్ ఓటు హక్కు వినియోగించుకోనున్న పోలింగ్ కేంద్రం

# టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని రోటరీపురం 20వ వార్డుకు చెందిన టీడీపీ నాయకులు కొమ్మద్ది రసూల్, రహీం వారి కుటుంబ సభ్యులు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. శ్రీకృష్ణదేవరాయల బలిజ సంఘం అధ్యక్షుడు గూడూరు గురుప్రసాద్, గాజుల బాబయ్య, కొమెర హరినాథ్, నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో చేరిన వీరికి మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, చైర్మన్ వరప్రసాద్, సివిల్‌సప్లై డైరెక్టర్ హాల్ గంగాధరరెడ్డి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో రసూల్, రహీం కుటుంబ సభ్యులు, అన్వర్, మస్తాన్, శ్రీను, బాబాజీ, కిషోర్, రహంతుల్లా, మహమ్మద్, శ్రీధర్, బాబా ఉన్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన పథకాలకు ఆకర్షితులమై వైఎస్సార్‌సీపీలోకి వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కోడిరమణ, మాజీ కోఆప్షన్ మెంబర్ దస్తగిరివల్లి, పద్మనాభరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శంకర జయంతి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరాలయంలో ఆదివారం శంకర జయంతి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేకువజామున శంకరాచార్యుల విగ్రహానికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అగస్త్యేశ్వరస్వామికి, రాజరాజేశ్వరి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. అనంతరం లోకకల్యాణార్థం వేదపారాయణం, గణపతి, నవగ్రహ, ఉపదేవతా హోమాలు, మృత్యుంజయ హోమాలను వేదపండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూర్ణాహుతిగా హోమద్రవ్యాలు, పూజాద్రవ్యాలను అర్పించి భక్తిశ్రద్ధలతో పూజించారు.

# దళారులు, సూట్ వ్యవస్థకు చెక్

**పులివెందుల కేంద్రంగా 3,544 టన్నుల చీనీకాయల క్రయ విక్రయాలు**

పులివెందుల రూరల్ : కష్టానికి తగ్గ దిగుబడి, దిగుబడికి తగ్గ ధరలు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.చీనీ రైతు లాభాలు ఆర్జించేందుకు దళారీ వ్యవస్థకు స్వస్తి పలికింది. పులివెందులలో గత ఏడాది అక్టోబర్ 10న చీనీకాయల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసింది. అక్టోబర్ 31 నాటికి 3,544 టన్నుల చీనీ కాయలను రైతుల నుంచి ట్రేడర్లు కొనుగోలు చేశారు. అత్యధిక ధర ప్రస్తుత మార్కెట్‌లో రూ.46వేలు పలికింది. అనంతపురం జిల్లా మార్కెట్ కంటే పులివెందులలో ధరలు బాగా పలుకుతున్నాయి. అందుకు కారణం ఇక్కడ నాణ్యమైన చీనీ కాయలు ఉండటమే.

పులివెందులలో సుమారు లక్షల వ్యయంతో జంబో షెడ్డులతో చీనీకాయల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 10 గదులను నిర్మించారు. చీనీకాయల మార్కెట్‌లో దళారులు, సూట్ వ్యవస్థకు చెక్ పడింది. 10 టన్నులు చీనీకాయలు కొనుగోలు చేస్తే 2టన్నులు సూట్ ఇవ్వాల్సిన పరిస్థితి ఉండేది. సూట్ ఇవ్వకుంటే ట్రేడర్స్ ముందుకు వచ్చేవారు కారు. ఈ పరిస్థితికి ప్రభుత్వం చెక్ పెట్టింది. మార్కెట్ కమిటీ ద్వారా కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి సూట్ వ్యవస్థ లేకుండా నేరుగా రైతుల వద్ద నుంచి కాయలను కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు తరలించేందుకు అవకాశం కల్పించింది.



చీనీమార్కెట్‌కు చీనీకాయలను తరలించిన రైతులు

**చీనీరైతులకు ఎంతో ఉపయోగం**



పులివెందుల ఏర్పాటు చేసిన చీనీమార్కెట్ ద్వారా కొనుగోలు చేయడం రైతులకు ఎంతో ఉపయోగం. రైతులకు ఆర్థిక ప్రయోజనాలు చేకూరాయి. దళారులు తీసుకుంటున్న సూట్ విధానం పూర్తిగా కనుమరుగైంది.

– శ్రీనివాసులు, చీనీకాయల వ్యాపారి

**మార్కెట్‌లో మంచి ధరలున్నాయి**



ప్రస్తుతం వేసవికాలం కావడంతో చీనీకాయలకు మార్కెట్‌లో డిమాండ్ ఉంది. రైతులు కష్టపడి పండించిన పంటలకు మంచి ధరలు లభిస్తున్నాయి. అనంతపురం జిల్లా కంటే పులివెందుల చీనీ మార్కెట్‌లో ధరలు బాగా ఉండడంతో రైతులు ఆనందంగా ఉన్నారు.

– గంగాధర, చీనీకాయల వ్యాపారి

## • అభివృద్ధి అదిరింది..

పులివెందుల ప్రాంతం అభివృద్ధిపథంలో దూసుకెళ్తోంది. పాడా సహకారంతో పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు రూ.1786కోట్లతో ప్రభుత్వం అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది.పులివెందుల మోడల్‌టౌన్‌లో భాగంగా ప్రగతి పనులకు రూ.651.19కోట్ల నిధులు విడుదల చేసింది. పులివెందుల ప్రాంతంలోని ప్రధాన రహదారుల విస్తరణ, సుందరీకరణకు సంబంధించి రూ.50కోట్లతో పనులు చేట్టారు. అలాగే రూ.87.50కోట్లతో మల్టీప్లెక్స్ పనులు దాదాపు పూర్తయ్యాయి. రూ.17.03కోట్లతో మున్సిపల్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేశారు. రూ.39 కోట్లతో పులివెందుల పట్టణంలోని గరండాల్ రివర్ ఫ్రంట్ అభివృద్ధి, రూ.65.99కోట్లతో పులివెందుల సమీపంలోని ఉలిమెల్ల లేక్ ఫ్రంట్ సుందరీకరణ, రూ.14కోట్లతో శిల్పారామం పనులు, రూ.5.60కోట్లతో చిత్రావతి జలాశయం వద్ద టూరిజం ఏర్పాటు చేశారు.

– పులివెందుల




పులివెందుల ముఖద్వారం

పులివెందుల గాంధీ సర్కిల్



పులివెందుల రింగురోడ్డు



పులివెందుల్లోని ఐజీకార్లు




పులివెందుల అప్‌గ్రేడ్ పోలీసు స్టేషన్

### గొడవలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు



ముద్దనూరు : బలగాలతో కవాతు నిర్వహిస్తున్న అదనపు ఎస్పీ, సీఐ

ముద్దనూరు : ఎన్నికల రోజున ఎవరైనా గొడవలకు పాల్పడితే పోలీసుల నుంచి తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని సెబ్ అదనపు ఎస్పీ వెంకట్రాముడు హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం ఆయన స్థానిక సీఐ దస్తగిరి, సాయుధ బలగాలతో కలిసి మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎవరి ఓటు హక్కు వారు వినియోగించుకుని వెళ్లాలని, పోలింగ్ బూత్‌ల వద్ద అతిగా ప్రవర్తిస్తే ఉపేక్షించబోమని, ఫ్యాక్షన్ నేపథ్యం ఉన్న, సమస్యాత్మక గ్రామాల్లో గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి పోలింగ్ చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.